
# ఆ నలుగురు

జయంతి వెంకటరమణ

ఆ నలుగురు ఏ స్టేషనులో ఎక్కారో నేను గుర్తించ లేదు గాని, వాళ్లు దిగాల్సిన ఊరు 'అనకాపల్లి'ని - 'అనకాపిల్లి' -'అనకాపిల్లి' అని అంటూంటే నాకు ఒళ్లంతా మండినట్టనిపించి 'అనకాపిల్లి' కాదండి 'అనకాపల్లి' 'అనకాపల్లి' అని అరచి చెప్పాను. నా మాటలకి ఆ నలుగురు నావేపు తిరుగారు. అందులో నడివయస్సాయన ''పిల్లికాదాండి - పల్లేండి' అంటు తన వారివేపు తిరిగి ''పిల్లి కాదం టరా... పల్లి-పల్లి.. గుర్తుంచుకోండి'' అంటు విరగ బడి నవ్వాడు.



అతను ఎగతాళి చేస్తున్నాడని అని పించిదపుడు మీద ఒకటి కొట్టాలనిపించి ఎడవవేపు మెరుస్తున్న బంగారు పన్నుని చూచి ఆగిపోయాను. కాని కోపం నాలో బుసలుకొడుతునే ఉంది. ఎందుకంటారా? ప్రతీమాటకి నవ్వే వాళ్ళన్నా, విరగబడి నవ్వేవాళ్లన్నా నాకు కోపం.

వాళ్ళమాటల్లో తెలిసింది. ఆ బంగారు పన్నాయన పేరు బాబురావని. అతని కన్నా పెద్ద వాడు, నంగినంగిగా వంగి వంగి మాటాడేవాడు, నల్లని వాని పేరు సూర్యారావుట. మిగిలిన ఇద్దరాడ వాళ్లలో ఒకామె కాస్త లావుగా, పొడవుగా, అంత తెలుపుకాని వర్ణంలో ఉంది. ఏబయి ఏళ్ళయినా ఉంటాయామెకి. మాటాడే టప్పుడు కళ్లు చిత్రంగా తిప్పడం, చేతులు విలాసంగా కదపడం ఆమెకలవాటని గ్రహించాను. మరో ఆమె అందంగా, నాజూగ్గా పొడవుగా ఉంది. పాతికేళ్ళు దాటీ దాటనట్టుంది ఆమె వయసు. వాళ్ళ మధ్య బాంధవ్యమేమిటో గాని పేర్లుపెట్టి పిలుచుకుంటున్నారు.

అనకాపల్లి వచ్చేసింది. ఆ నలుగురూ బ్యాగులతో దిగేశారు. నేనూ అక్కడే దిగాలి కాబట్టి వాళ్ళ వెనుకే దిగేశాను. దిగిన వాళ్ళు వెయిటింగ్ రూము ఎక్కడ? అని ఎవరినో అడిగితే వెయిటింగ్ హాలువేపు దారి చూపారు. వాళ్ళటు వెళ్లగానే నేను నా సాహితీ మిత్రుడు సుందరం కోసం ఎదురు చూస్తూ నిలబడ్డాను. ఫోన్ చేస్తే సుందరం ఫోన్ 'ఆఫ్'లో ఉంది. పదిహేను నిమిషాలైనా నా మిత్రుడు రాలేదు. కాని ఆ నలుగురు చకచకా వెయిటింగ్ హాలు నుండి బయటకు వచ్చారు. అ బంగారు పన్ను నా కంట పడకపోతే వీళ్లు వాళ్లేనని పోల్చలేక పోయేవాడిని. అంతలా వాళ్ళ వేషాలు మారాయి. మగాళ్ళు పాంటు, షర్టుల వదిలేసి, ఖద్దరు పంచె, కల్లీ లాల్చీల్లోకి మారారు. పొడుగు బొట్టు పెట్టారు. కండువాలు వేసుకున్నారు. ఆడవాళ్ళు నూలు చీరలు, పొట్టి చేతుల రవికలు వేసుకున్నారు. వాళ్ళలా వెళ్లిన పది నిమిషాలకి మా సుందరం వచ్చాడు. నేనూ, సుందరం కలిసి శ్రీనాథుని రచనల్ని కూర్చిపెట్టాలని సంకల్పించాము. ఇపుడు ఆపని మీదే నేరావటం జరిగింది. ఊరినంతా చూపించినట్టు తిప్పి నన్ను వాళ్ల కాలనీలోకి తీసికెళ్లాడు. అది కొత్త కాలనీ. చాలా ప్లానింగుగా కట్టుకున్నారు యిళ్ళు.

మేం యిల్లు చేరి ఆమాటా ఈమాట చెప్పుకుంటూ కాఫీ తాగుతూంటే మా సుందరం యింటిముందు పెద్ద కలకలం. గుండెలు బద్దలయ్యేలా పెద్దగా ఏడ్పులు ''సుందరమో... ఓ సుందరమా... నీకప్పుడే నూరేళ్ళు నిండాయా సుందరమా... సుందరమా.. ఓ...'' మేము ఒక్కసారి గభాలున వీధిలోకి పరుగెత్తాం. మా వెనుకే సుందరం భార్య, కొడుకు, కోడలు, పిల్లలు పరిగెత్తుకొచ్చారు. వరండా మెట్లమీద కూర్చుని జుత్తులు రేపుకుని గుండె బద్దలయ్యేలా ఏడుస్తున్నారు. వాళ్ళే! ఆ నలుగురు!

''సుందరమా... ఓ సుందరమా...'' స్వరం పెంచారు వాళ్ళు. ఆ బంగారు పన్ను బాబూరావును పోల్చేశాను నేను. ఈ చిత్రమేదో చూదామని అందరి వెనుక నిలబడ్డాను.

''ఆగండాగండి. ఏమిటా ఏడ్పులు, ఎవరో పోయినట్టు. ఇక్కడెవరూ పోలేదు... వెళ్ళండి... వెళ్ళండి'' అరిచాడు సుందరం.

''ఎవరూ పోకపోవడమేమిటి నాయనా... మా సుందరం పోతేనూ..' నిన్న పొద్దే కాలధర్మం చెందినాడని కబురొస్తే పారొచ్చినాము నాయనా' దీర్ఘాలు తీస్తూ చెప్పింది పెద్దావిడ. మిగిలిన వాళ్ళు శృతికలిపారు.

''చెప్తున్నాను. ఇక్కడెవరు పోలేదు.. మీరెవరి కోసం ఏడేస్తున్నారో ఆ సుందరాన్ని నేనే. చూశారుగా. నిక్షేపంగా ఉన్నా'' అన్నాడు సుందరం.

''అయ్యో! మా సుందరం పోయినాడని కబురొస్తే సీకాకులం నుండి పారొచ్చినాము సామీ'' అన్నాడు బంగారు పన్ను.

''చెప్పానుగా నేను బతికే ఉన్నాను. ఈ కాలనీలో మరో ముగ్గురు సుందరాలున్నారు. గుండు సుందరం, కర్రి సుందరం, పొట్టి సుందరమని. వాళ్ళలో మీ వాళ్ళేవరో చూడండి. అయినా మీ సుందరం మీకు తెలియడా? తెలీకనే వచ్చారా'' గద్దించాడు సుందరం.

''అయితే పోయింది నీవు కాదా సామీ. తప్పయిపోయింది నాయినా. ఛామించాలి, చానాళ్ళయినది కదా మా సుందరాన్ని సూసి... పోల్చలేక పోయినాము'' అంటు లేచారా నలుగురు కళ్ళుతుడుచుకుని, జుట్లు సరిచేసికుంటూ.

''అయినా పీనుగుపోయిన వాకిలి ఇలా ఉంటదా దద్దా. సామియనా లెవ్వి, పూలదండ రేకులెవ్వి.. కుర్చీలేవి.. పొరపాటుయినాది. పదండి పదండి'' అన్నాడు బంగారు పన్ను.

''హమ్మయ్యా! పీడపోయింది. నేనెంత కంగారుపడ్డాను'' అంది సుందరం భార్య. ''పోలేదమ్మ! పీడపోలేదు. వీళ్ళు శ్రీకాకుళం నుండి వచ్చిన వాళ్ళు కారు. వీళ్ళ భాష, వేషం యివి కావు. వీళ్ళు నాతోపాటు తిరుమలలో దిగారు. సుందరమనే వ్యక్తి పోయినట్టు తెలుసుకుని ఏదో ప్లాన్ మీద వచ్చారు. చుట్టరికం కలుపుకుని, యింట్లో చేరి దుఃఖంలో వాళ్ళు పట్టించుకోని పరిస్థితిలో అందినంతా దోచుకుపోదామని వచ్చినట్టు నాకనిపిస్తోంది'' అంటు ట్రైన్‌లో నే చూచినదంతా చెప్పాను.

ఇంతలో సుందరం మనవడు పరుగెత్తుకుంటూ వచ్చి ''తాతగారూ.. వాళ్ళు... వాళ్ళు... మనింటిలో ముందేడ్చినట్టే కర్రి సుందరం గారింటిముందేడుస్తున్నారు చూడండి వెళ్ళి'' అన్నాడు.


''పదండి ఆ సుందరంగారి కుటుంబ సభ్యుల్ని ఓసారి పలకరించి వద్దాం'' అన్నాను. నిజాన్ని రాబట్టాలనే ఉంది నాకు.

ఇద్దరం కర్రి సుందరం యింటికెళ్లాము. వీధి మొగలు నుండే వాళ్ళ ఏడ్పులు మాకు వినిపించసాగాయి. వాళ్ళ ఏడ్పులు వినికాబోలు వీధి చివరి వాళ్ళు, చుట్టు ప్రక్కల వాళ్ళు వచ్చి చేరారు అంతకుముందే. ఎపుడు పోయారు?... ఎలా పోయారు?... ఈయనని అనుకోలేదు సుమండీ.

.... అయ్యో పోయారా... వారం క్రితం పాలపాకెట్లు తేవడం చూశానండీ... అయ్యో! పాపం...'' అని తలోరకంగా అంటూంటే చేరుతున్న కొత్త వాళ్ళని చూచి స్వరం మరీ పెంచి ఏడుస్తున్నారు వాళ్ళు. వాళ్ళే.... ఆ నలుగురు. పెద్దామె ఏడుస్తూంటే మిగిలిన వాళ్ళు వంతపాడుతున్నారు.

సుందరం కుమారుని ఓదార్చి వచ్చామేగాని, నా చెవిలో యింకా వాళ్ళ రోదనలే వినిపించసాగాయి.

పరామర్శించడానికి వచ్చిన వాళ్ళను చూచి వంతులవారీగా రెండు రోజులు ఏడుస్తునే ఉన్నారు వాళ్ళు. వాళ్ళ ఏడ్పులో ఏదో ఆకర్షణ ఉండేది. మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉంటే మనిషికి గుర్తింపు వస్తుందో, వాళ్ళ ఏడ్పుల్లో వినిపించేవి. దీర్ఘాలు తీస్తూ వాళ్ళేడుస్తుంటే... ఓ లయ.... ఓ తాళం... శాస్త్రీయ సంగీతంలో ఏదో రాగాన్ని విన్నట్టుండేది. నా సాహిత్య వ్యాసంగాన్ని ప్రక్కనపెట్టి ఆ రెండు రోజులు ఉదయ, సాయంత్రాలలో అక్కడికెళ్ళి కాసేపు కూర్చుని వచ్చేవాడిని.

మూడో రోజు ఉదయం అటువెళ్లిన నాకు ఏ ఏడ్పు వినిపించలేదు. వాళ్ళూ వీధి వరండాలో కనిపించలేదు. నేను వెనుదిరుగుతూంటే కర్రి సుందరం కొడుకు స్కూటరు దిగుతూ నాకెదురొచ్చాడు. రోజు నన్ను చూస్తున్నాడు కాబట్టి నన్ను గుర్తు పట్టాడు.

''మీ బంధువులేరి?'' అడిగాను.

''ఉదయమే వెళ్లారు. ట్రైనెక్కించి వస్తున్నానిప్పుడే'' అన్నాడు.

''అడుగుతున్నానని ఏమనుకోకండి. నిజంగా వాళ్ళు మీ బంధువులేనా?'' అడిగాను.

''కారు''

''మరి''

''మా నాన్న బ్రతికున్న రోజుల్లో అనేవారు. మోసేవాళ్ళు కాదురా. మన కోసం ఏడ్చే వాళ్ళు కూడా ఓ నలుగురు ఉండాలని. ఆ ఏడ్చే వాళ్ళంటే, ఈర్ష్యతో, అసూయతో ఏడ్చే వాళ్ళు కాదు. అలా ఏడ్చే వాళ్ళు చాలామందే ఉన్నారు. మా కష్టాల్ని, బాధల్ని చూచి ఏడ్చేవాళ్ళు, విచారించే వాళ్ళూ ఉన్నారు, చాలా దూరంలో. అందుకే మానాన్న కోరిక తీర్చటం కోసం, మా అమ్మ పోరుపడలేక వీళ్ళను రప్పించాను; గోదావరి ప్రాంతం నుండి. వీళ్ళు మన బంధువుల్లాగే ఏడుస్తారు. వీళ్ళను మా మిత్రుడి యింటిలో యిలాంటి పరిస్థితిలో చూశాను. మనం ఫోన్ చేసి వాళ్ళడిగిన వివరాలు చెప్తేచాలు రెక్కలు కట్టుకుని వాల్తారు. మిగతాపని వాళ్ళు చూచుకుంటారు''

''నిజమే. నిజమైన ఆత్మీయుల్లా విలపించారు. కానీ శ్రీకాకుళం నుండి వచ్చామన్నారే?''

''అవును. అలాగే చెప్పాలి. ఎందుకంటే మా నాయనిది ఆ ప్రాంతమే''

''అవునా! కాని ట్రైనులో వాళ్ళ ఇక ఇకలూ, పకపకలు భరించలేకపోయాను

వాళ్ళలో వాళ్ళు ఎవరికేమవుతారో గాని... భరించలేక పోయాను

''వీళ్లు ఎవరికి వాళ్ళే'' ఇలాంటి పనుల మీదే! కలుస్తారు. ఏడుస్తారు. ఏడిపిస్తారు. ఒకానొకప్పుడు నాటకరంగం మీద రంగులు పులుముకుని నటించే వీళ్ళు అవకాశాలు లేక ఇలాంటి పనుల కొప్పుకుంటున్నారు బ్రతుకు తెరువు కోసం. మీకు తెలుసుగా రికార్డింగు డాన్సులు, డాన్సు బేబీలు వచ్చి నాటకరంగానికి తెర దించేస్తున్నాయని. ఆనాటి నాటకాలూ లేవు. ఆ నటనావకాశాలు లేవు. మరేం చేస్తారు. మనసారా ఏడ్వాలి కాబట్టి నవ్వులు పండించుకుంటూ వస్తారు. ఏడ్చి, ఏడ్పించి పోతారు. ఇప్పుడు ట్రైనులో అలాగే నవ్వుకుంటూ ఉంటారు. నా ఏడ్పులు నాకు వదలి''

''ఇక ఏడ్పేముంది. మీ నాన్నగారి కోరిక తీర్చారుగా''

''నిజమే ఆయన కోరికైతే తీరింది. కాని అసలైన ఏడుపు యిప్పుడేగా మొదలయింది''

''మీరేమంటున్నారో నాకర్థంకావటం లేదు''

''ఎవరికీ చెప్పుకోలేని ఏడుపు సార్ యిది. కాశీ ప్రయాణానికని దాచిన డబ్బంతా, వీళ్ళ ట్రైను టిక్కెట్లకీ, బిర్యాని పొట్లాలకి, కాఫీ టిఫిన్లకి, వీళ్ళ ఏడ్పుల ఫీజులకి ఖర్చయి పోయింది సార్.

మా నాయనగారి అంతిమ కోర్కె తీర్చటం కోసం ఇంత ఏడుపు ఉంటుందనుకోలేదు సార్. ఇక దినవారాలెలా గడుస్తాయో తెలీదు. రాజమండ్రి కూడా వెళ్ళలేనేమో అనిపిస్తోంది. నేనెవరితో చెప్పుకుని ఏడ్వాలిసార్. నా ఏడ్పునెవరు వింటారు! ఊళ్ళో నలుగుర్ని పిలిచి విస్తరేసి యింత అన్నమైన పెట్టాలిగా...'' అంటూ జుట్టు పీక్కోబోయి, జుట్టందక గుండు గోక్కున్నాడు సుందరం కొడుకు సదానందం.

నాకేమి చెప్పాలో అర్థం కాలేదు. కాని ఒకటి మాత్రం నిజం అని మాత్రం నాకనిపించింది. నవ్వుకోవడం కోసమైనా ఎంత దుఃఖాన్నైనా దిగమింగాలని. ఆ నలుగురు తమ జీవితాల్లో నవ్వుల కోసం, దుఃఖానికెంతో విలువిచ్చారని.

★

జయంతి వెంకటరమణ

***0891-2764940***

# హింసధ్వని



ఎక్కడో ఒకచోట ప్రాణభీతి
విస్తరిస్తున్న భయం
ప్రతీకార గమ్యం చేరాలనే ఆరాటం,
ఆత్మీయులను శాశ్వతంగా
కోల్పోతామనే
అనుమానాల అడవిలో
పరస్పర మారణహోమం!

ఎవరెన్ని శాంతి వచనాలు పలికినా
నీతి బోధల అనుగ్రాహభాషణమంతా
మాడి పోతున్నది రాగద్వేషాల మంటల్లో!
భస్మసింహాసనం కోసం
పేలుతున్న మందుపాతరలు,
తెగిపడిన అవయవాల మధ్య
లెంపలేసుకుంటూ
మరో మారణహోమానికి సిద్ధం!

చట్టం చట్టుబండలై
న్యాయమూర్తుల
వ్యాఖ్యానాలన్నీ
శాస్త్రగ్రంథాల దూలాలపై
వేలాడుతుంటే
'బెనిఫిట్ ఆఫ్ డౌట్' అనే
సందేహ లాభంతో
నేరస్తులందరికీ ఆటవిడుపు!

సామాజిక న్యాయం సొంతం
దళారుల భోజ్యమై
ఆర్థిక కొలమానాల నడుమ
తత్వవేత్తల ఎత్తిపోతల
రాతల కీకారణ్యంలో
తప్పిపోతున్న బుద్ధి జీవులు,
ఇటు యధావిధిగా
నెత్తుటి క్రీడలో

కొనసాగుతున్న హింసాతాండవం,
భయం-ప్రతీకారం హింస ధ్వనిలో
దారి వెతుక్కుంటున్న వర్తమానం!!

– నిఖిలేశ్వర్